క్లుప్తంగా

బాధ్యతగా వ్యవహరించాలి..

● ఎంవీఐ వేణుగోపాలరావు



వాహన చోదకులు, ఆటో, మ్యాక్సీక్యాబ్ డ్రైవర్లతో కలసి ప్లకార్డులు ద్వారా అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ, తదితరులు

పాలకొండ రూరల్: సురక్షిత ప్రయాణం కోసం వాహన చోదకులు బాధ్యతగా వ్యవహరించాలని పాలకొండ మోటార్ వెహికల్ అధికారి టి.వేణుగోపాలరావు అన్నారు. జాతీయ రహదారుల సంస్థ, సంబంధిత శాఖ ఆదేశాలతో సడక్ సురక్ష అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా సీతంపేట రహదారిలో శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. లాభాపేక్షతో లెక్కకు మించిన ప్రయాణికులను ఎక్కించడం సరికాదన్నారు. నాలుగు చక్రాల వాహనాల్లో ఉన్న వారు తప్పనసరిగా సీట్‌బెల్ట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ మోటారు వెహికల్ అధికారి నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం..



కోడిశలో మౌనిక కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: మండలంలోని పలువురు మృతుల కుటుంబాలను పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం పరామర్శించారు. కొత్తగూడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సవర భారతి మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే కోడిశకు చెందిన ఎస్.మౌనిక ఇటీవల క్యాన్సర్‌తో బాధపడుతూ మృతి చెందింది. ఆమె తండ్రి కృష్ణ సైతం క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఈ కుటుంబాన్ని పరామర్శించారు. పీజేగూడకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సవర సన్నాయి అనారోగ్యంతో మంచాన పడడంతో ఆయన్ను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకి, గణేష్, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు



వీరఘట్టం పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కె.విజయపార్వతి, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్‌మోహన్‌రావు

వీరఘట్టం: క్షేత్రస్థాయిలో ఆరోగ్య సర్వేలు పక్కాగా చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కె.విజయపార్వతి, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్‌మోహనరావు వైద్య సిబ్బందికి సూచించారు. వీరఘట్టం పీహెచ్‌సీని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 20 నుంచి కుష్టు రోగుల గుర్తింపును పక్కాగా చేపట్టాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి కుష్టు వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి, వివరాలు నమోదు చేయాలన్నారు. చర్మంపై స్పర్శ, నొప్పి, దురద లేని ఎర్ర మచ్చలుంటే కుష్టుగా అనుమానించాలన్నారు. వెంటనే సమీప పీహెచ్‌సీల్లో అటువంటి వారికి పరీక్షలు చేయించాలన్నారు. సమావేశంలో వీరఘట్టం పీహెచ్‌సీ డాక్టర్ ప్రదీప్‌కుమార్, డెమో వై.యోగీశ్వరరెడ్డి, డీఎస్‌ఓ శంకర్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పీహెచ్‌సీ ఆవరణలో కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ చేపట్టారు.

అభివృద్ధి చేస్తే అద్భుతం..



వీరఘట్టం సమీపంలో విశాలంగా ఉన్న వెంకమ్మ చెరువు

- వీరఘట్టం సమీపంలోని వెంకమ్మ చెరువు చుట్టూ ప్రశాంత వాతావరణం
- పక్కనే మరియగిరి పుణ్యక్షేత్రం
- పర్యాటక ప్రాంతంగా విరాజిల్లే అవకాశం
- చెరువు విస్తీర్ణం సుమారు 200 ఎకరాలు
- ఆక్రమణలో ఉన్నది సుమారు 80 ఎకరాలు
- చెరువు ఆయకట్టు సుమారు 500 ఎకరాలకు పైనే..



ప్రశాంతంగా ఉన్న వెంకమ్మ చెరువు పరిసర ప్రాంతం

వీరఘట్టం:

చుట్టూ ఆహ్లాదకర వాతావరణం.. చల్లటి గాలి, కనువిందు గొలిపే అందాలతో పాటు పక్కనే మరియగిరి పుణ్యక్షేత్రం.. ఇటువంటి ప్రత్యేకతలున్న వెంకమ్మ చెరువును పర్యాటక కేంద్రంగా మార్చితే భవిష్యత్‌లో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. వీరఘట్టంనకు రెండు కిలోమీటర్ల దూరంలో పాలకొండ రోడ్డులో ఉన్న వెంకమ్మచెరువు ప్రశాంతతకు నెలవుగా మారింది. వీరఘట్టం వాసులు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసుకుంటూ ఈ ప్రాంతానికి వచ్చి సేద తీరుతుంటారు. అలసటతో వచ్చే వారికి ఇక్కడ ఎంతో ఉపశమనం కలుగుతుంది. అందుచే రోజు రోజుకూ వాకర్స్ సంఖ్య పెరుగుతోంది.

ఇదీ పరిస్థితి..

మండల కేంద్రానికి సమీపంలో ఉన్న మరియగిరి పుణ్యక్షేత్రానికి ఆనుకుని ఉన్న వెంకమ్మ చెరువు ప్రశాంతతకు నిలయంగా మారింది. సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో గల ఈ చెరువులో సుమారు 80 ఎకరాలు ఆక్రమణలకు గురైంది. సమీపంలో ఉన్న రైతులు ఆక్రమించుకోవడంతో చెరువు విస్తీర్ణం ప్రతి ఏటా కుచించుకుపోతోంది. సమీపంలోని పంట పొలాలకు ఈ చెరువు నీరే ఆధారం. సుమారు 500 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తోంది. దీంతో దిగువ ఆయకట్టు రైతులు ప్రతి ఏటా రెండు పంటలు పండిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. అయితే చెరువు పరిస్థితి మాత్రం దినదిన గండంగా మారింది.

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి..

జిల్లాలో సుమారు 200 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఏకైక చెరువుగా వెంకమ్మచెరువుకు గుర్తింపు ఉంది. ఇటువంటి చెరువును పర్యాటక కేంద్రంగా మార్చితే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందే అవకాశాలున్నాయి. ఈ చెరువు ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో వేగంగా అభివృద్ధి చెందేందుకు అవకాశాలు ఉన్నాయి.

చుట్టూ ఆక్రమణలు ..

వీరఘట్టం, చిదిమి, యు.వెంకమ్మపేట పంచాయతీల పరిధిలో ఉన్న వెంకమ్మచెరువు ప్రస్తుతం ఆక్రమణదారుల చెరలో పడి కుచించుకుపోతోంది. ఈ చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలంటే ముందుగా చెరువు చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలగించాలి. ప్రస్తుతం భూమి రేటు పెరుగుతుండడంతో ఆక్రమణదారులు చెరువు గర్భంపై ఆక్రమణకు తెగబడుతున్నారు. గ్రామ పెద్దలు, రెవెన్యూ అధికారులు, పోలీసులు సంయుక్తంగా సమన్వయంతో వ్యవహరించి ఆక్రమణలు తొలగిస్తే ఈ ప్రాంతం భవిష్యత్‌లో జిల్లాకే తలమానికంగా మారే అవకాశాలు ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

చొరవ చూపాలి



ప్రతిరోజూ వెంకమ్మ చెరువు ప్రాంతానికి వాకింగ్‌కు వెళ్తుంటాం. ఇక్కడ వాతావరణం ఎంతో హాయిగా ఉంటుంది. ఎంతో విశాలంగా ఉన్న చెరువులో ఉన్న నీటి అలలపై వచ్చే చల్లగాలి మనసుకు ప్రశాంతతనిస్తుంది. ఇటువంటి చెరువును అభివృద్ధి చేస్తే భవిష్యత్‌లో గొప్ప పర్యాటక కేంద్రంగా మారుతుంది. ఈ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి.

భోగి మణి, వీరఘట్టం

ఆక్రమణలు తొలగించాలి..



వెంకమ్మ చెరువును బాగు చేయాలంటే ముందుగా చెరువు చుట్టూ ఉన్న ఆక్రమణలు తొలగించాలి. ప్రస్తుతం భూసర్వే చేస్తున్నారు కాబట్టి ఈ సర్వేలో ఆక్రమణలు గుర్తించాలి. అలాగే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలి.

జలుమూరు అమర్‌నాథ్, వీరఘట్టం

హెల్మెట్ తప్పనిసరి



వీరఘట్టం: హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై కళాధర్



సీతంపేట: అవగాహన సదస్సు నిర్వహిస్తున్న పోలీసులు

వీరఘట్టం: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై జి.కళాధర్ సూచించారు. వీరఘట్టం – పాలకొండ రోడ్డులో శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించి ప్రయాణాలు సాగించిన వారిని అభినందించారు. హెల్మెట్ ధరించని వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. పరిమిత వేగంతో రాకపోకలు సాగించాలని సూచించారు.

హెల్మెట్ పెట్టుకో... ప్రాణాలను రక్షించుకో..

గరుగుబిల్లి: దిచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్సై పి.రమేష్‌నాయుడు సూచించారు. మండలంలోని నందివానివలస వద్ద నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. మద్యం మత్తులో వాహనాలు నడపకూడదన్నారు. అధిక వేగంతో ప్రయాణాలు సాగిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌సీ చిన్నారావు, సిబ్బంది శంకరరావు, తదితరులున్నారు.



గరుగుబిల్లి: అవగాహన కల్పిస్తున్న ఎస్సై రమేష్‌నాయుడు

తప్పనిసరి..

సీతంపేట: హెల్మెట్‌ధారణ తప్పనిసరని ఎస్సై అమ్మన్నరావు తెలిపారు. మండల కేంద్రంలో వాహనచోదకులకు హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణాలు నిలబడతాయి..

భామిని: హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల్లో ప్రాణాలతో బయటపడవచ్చని బత్తిలి ఎస్సై డి.అనిల్‌కుమార్ అన్నారు. బత్తిలి బస్టాండ్‌లో వాహనదారులు, యువతకు అవగాహన కల్పించారు. హెల్మెట్ వినియోగం వల్ల కలిగే లాభాలను వివరించడంతో పాటు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.



భామిని:హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న బత్తిలి ఎస్సై అనిల్ కుమార్

పరామర్శ..



రాజశేఖరం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పిరియ విజయ, కంబాల జోగలు

పాలకొండ:

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు పలువురు రాజకీయ నాయకులు, అధికారులు రాజశేఖరం కుమారుడు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, కుమార్తె మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, భార్య ఇందుమతిలను శనివారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో శ్రీకాకుళం జెడ్పీ చైర్మన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్యే మీసాల నీలకంఠంనాయుడు, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఏపీ ఎన్‌జీఓ సంఘ నాయకులు చౌదరి పురుషోత్తంనాయుడు, హనుమంతు సాయిరాం, ఎద్దు లిల్లీ పుష్పనాథం, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన నాయకులు పిసిని చంద్రమోహన్, జిల్లా అధ్యక్షుడు గర్భాన సత్తిబాబు, తదితరులున్నారు..



ఎమ్మెల్సీ విక్రాంత్‌ను పరామర్శిస్తున్న ఏపీ ఎన్‌జీఓ సంఘ నాయకులు

చెత్తలు బాబోయ్ చెత్తలు



గౌడువీధి-చాకలివీధి మధ్యలో రోడ్డుపైనే చెత్త

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీలో ఎక్కడ చూసినా చెత్తలు పేరుకుపోయాయి. పండగ సీజన్ కావడంతో ఏ వీధిలో చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. వాస్తవానికి పండగ సీజన్‌లో పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలి. అయితే అధికారులు ఆ దిశగా ఆలోచన చేయకపోవడంతో ప్రస్తుతం ఉన్నవారికి పనిభారం పెరిగిపోయింది. దీంతో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టలేకపోవడంతో వీధుల్లో చెత్త పేరుకుపోయింది. చెత్తా,చెదారాల వల్ల దుర్గంధం వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే పారిశుధ్య పనులు చేపట్టలని కోరుతున్నారు.



:ప్రదాన రహదారిలో అందవరపు వీధి జంక్షన్ వద్ద దుస్థితి



రాజుగారివీధి జంక్షన్‌లో పేరుకుపోయిన చెత్త

పాడి రైతులను చైతన్యవంతం చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ దీనకుమార్

సీతానగరం: గ్రామాల్లో పాడి పరిశ్రమ అభివృద్ధి, పాడి రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చి వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం పశువైద్యాధికారులపై ఉందని పశుసంవర్ధక శాఖ ఏడీ సీహెచ్ దీనకుమార్ అన్నారు. స్థానిక పశువైద్య సబ్ డివిజన్ కార్యాలయంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.రామారావు అధ్యక్షతన బలిజిపేట, సీతానగరం మండలాల పశువైద్యాధికారులు గ్రామీణ పశువైద్యాధికారులు, పశుసంవర్ధక శాఖ సహాయకులతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సీహెచ్ దీనకుమార్ మాట్లాడుతూ సోమవారం నుంచి గ్రామాల్లో నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాలతో పాటు పాడి రైతులను చైతన్య పర్చడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పాడి రైతులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో బలిజిపేట, చిలకలపిల్లి, అరసాడ, కోటసీతారాంపురం పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: ర్యాలీ చేస్తున్న సిబ్బంది



పరిశుభ్రతలో అగ్రగామి..



గరుగుబిల్లి: రావుపల్లిలో ర్యాలీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పరిశుభ్రతలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ ఎం.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జియ్యమ్మవలస మండలం కుదమ పంచాయతీలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రం చేశారు. సీతంపేటలో మండల ప్రత్యేకాధికారి గియాజుద్దీన్ ఆధ్వర్యంలో మానవహారంగా ఏర్పడి, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. గురుగుబిల్లి మండలం రావుపల్లిలో అవగాహన సదస్సు నిర్వహించారు. భామిని మండల కేంద్రంలో కూడా అవగాహన ర్యాలీలు నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను చైతన్యపరిచారు.

- జియ్యమ్మవలస/సీతంపేట/గరుగుబిల్లి/భామిని



భామిని: అంబేడ్కర్ కూడలిలో మానవహారంగా ఏర్పడిన అధికారులు

విశేష పూజలు..

పాలకొండ పట్టణంలోని భీమ లింగేశ్వర ఆలయంతో పాటు నక్కలపేటలోని మృత్యుంజయ మరకత లింగేశ్వర ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. భీమ లింగేశ్వరుడ్ని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. నాగవంశపు వీధిలో అన్నసమారాధన చేపట్టారు.

- పాలకొండ రూరల్



అవగాహన..



గుమ్మలక్ష్మీపురం మండలంలోని గోరడ సంతలో అటవీ ఉత్పత్తుల నాణ్యత పెంచడంపై జీసీసీ మేనేజర్ వి.కృష్ణప్రసాదరావు శనివారం అవగాహన కల్పించారు. ఉత్పత్తులను జీసీసీ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావడం, కొత్త రేట్లు, నాణ్యతా ప్రమాణాలపై వివరించారు. కార్యక్రమంలో గణపతిరావు, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు. - గుమ్మలక్ష్మీపురం

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



పరీక్ష జరుగుతున్న తీరును పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ పరశురామయ్య, ఎంఈఓ ఆనందరావు, సూపరింటెండెట్ శ్రీనివాసరావు

వీరఘట్టం: మండల కేంద్రంలోని బాలికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. వెన్నెలవలస నవోదయ ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య ఆధ్వర్యంలో పోలీసులు ప్రతి విద్యార్థినీ క్షుణ్ణంగా తనిఖీ చేసి హాల్‌లోకి పంపించారు. 249 మంది విద్యార్థులకు గాను 224 మంది హాజరైనట్లు ఎంఈఓ ఆర్. ఆనందరావు, పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్ గర్భాన శ్రీనివాసరావు తెలిపారు. అంతకుముందు తహసీల్దార్ చందక సత్యనారాయణ, ఆర్‌ఐ లక్ష్మునాయుడు పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.



విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష హాల్‌లోకి పంపిస్తున్న పోలీసులు